## రాష్ట్రపతి నిలయంలో జూన్ 3 నుంచి పర్యావరణ దినోత్సవం

బొల్లారం, మే 30: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రాష్ట్రపతి నిలయం అధికారి రజినిప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించడంతోపాటు వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు దోహదపడుతాయని తెలిపారు. 10 నుంచి 18 ఏండ్ల వయసు కలిగిన విద్యార్థులు ఈ వర్క్‌షాపుల్లో పాల్గొనవచ్చని, ప్రతి రోజు ఉదయం 10 నుంచి 4 గంటల వరకు వర్క్‌షాపులు నిర్వహించబడుతాయన్నారు. వర్క్‌షాప్‌లో భాగంగా మట్టికుండల తయారీ, వృధా పదార్థాలతో వినూత్న వస్తువుల తయారీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, టెర్రకోట నగలు తయారీ, అగ్ని వేయకుండా వంటకాల తయారీ, డ్రోన్ మేకింగ్ వర్క్‌షాప్‌లు నిర్వహించబడుతాయని వెల్లడించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు రాష్ట్రపతి నిలయం వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 040-23560518 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## రెవెన్యూ వసూళ్లలో వేగం పెంచాలి

సిటీబ్యూరో, మే 30(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీకి సంబంధించిన రెవెన్యూ వసూళ్లలో మరింత వేగం పెంచాలని జోనల్ డిప్యూటీ కమిషనర్లకు అదనపు కమిషనర్ (రెవెన్యూ) అనురాగ్ జయంతి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని, వచ్చే నెలాఖరు వరకు ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎంసీలను ఆదేశించారు. వీటితోపాటు వేకెండ్ ల్యాండ్ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్‌లపై నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. వీటితోపాటు జీఐఎస్ సర్వేను వేగవంతం చేయాలని చెప్పారు.

## 4న బల్దియా సమావేశం

సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ) : వచ్చే నెల 4వ తేదీన జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ మేరకు వివిధ పార్టీల సభ్యులకు సమాచారం అందజేశారు. పారిశుద్ధ్యం, టౌన్ ప్లానింగ్, అకౌంట్స్, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులు , ఎస్టేట్ విభాగాల ప్రశ్నలపై చర్చ జరగనుంది. దాదాపు 20 ప్రశ్నలపై కూడా సుదీర్ఘ చర్చ జరగనుంది. కాగా 16 నెలల కాలంగా పేరుకుపోయిన సమస్యలపై అధికార పార్టీని నిలదీసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్నారు. ప్రతి 3 నెలలకోసారి జరగాల్సిన సర్వసభ్య సమావేశం ఆలస్యమై 4 నెలలు దాటింది. ఈ నేపథ్యంలోనే అన్ని పార్టీలు కౌన్సిల్ సమావేశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో రాజకీయ వేడి అలుముకున్నది.

## జీహెచ్‌ఎంసీలో 1,578 పోస్టులు భర్తీకి గ్రీన్‌సిగ్నల్

సిటీబ్యూరో, మే 30(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం మరింత బలోపేతం కానున్నది. పెరుగుతున్న జనాభా ఒక వైపు.. అదే సమయంలో ఇంటింటి చెత్త సేకరణ, వ్యర్థాల తరలింపులో ఆటంకాలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా జీవీపీ(తరచూ చెత్త వేసే బహిరంగ ప్రదేశాలు) పాయింట్ల ఎత్తివేత అసాధ్యంగా మారింది. ఈ నేపథ్యంలోనే వందకు వంద శాతం చెత్త సేకరణతో రోజువారీగా దాదాపు 7వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలను పక్కాగా జవహర్‌నగర్ డంపింగ్ యార్డుకు తరలించేందుకు ప్రణాళికలు ప్రారంభించారు. ఇందులో భాగంగానే శానిటేషన్ విభాగంలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు 1,578 మంది వర్కర్స్ నియామకానికి కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ మేరకు జోనల్ వారీగా ఖాళీలను భర్తీ చేసేందుకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఎల్బీనగర్‌లో 78, చార్మినార్‌లో 387, ఖైరతాబాద్‌లో 326, శేరిలింగంపల్లిలో 161, కూకట్‌పల్లిలో 502, సికింద్రాబాద్‌లో 124 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఈ పోస్టులను నియమించనున్నారు.

# కొత్త ప్రాజెక్టులేవి..?

## హెచ్‌ఎండీఏలో ఆగిన అభివృద్ధి

- ఏడాదిన్నర గడిచినా గుర్తుకు రాని కొత్త ప్రాజెక్టుల నిర్మాణం
- ప్రతిపాదనలకే పరిమితమైన ప్రాజెక్టులు
- అటకెక్కిన రూ.5వేల కోట్ల ప్రాజెక్టుల ప్రతిపాదనలు



సిటీబ్యూరో, మే 30(నమస్తే తెలంగాణ): 11 జిల్లాలకు విస్తరించిన హెచ్‌ఎండీఏలో పురోగతి లేకుండా పోయింది. అట్టహాసంగా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టే ఆ విభాగం కుంటుపడింది. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయక, కొత్త ప్రాజెక్టులను చేపట్టక ప్రణాళికలను సాగదీస్తున్నారు. అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దే క్రమంలో అధునాతన ప్రతిపాదనలు, అంతకు మించిన ప్రణాళికలను రూపొందించాల్సిన హెచ్‌ఎండీఏ చేతులెత్తేసింది. కనీసం గతంలో రూపొందించిన రూ.5వేల కోట్ల ప్రతిపాదనలకైనా కార్యరూపంలో తీసుకురావడానికి వెనుకడుగు వేస్తున్నది.

హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) పరిధి ఇటీవల 11 జిల్లాలకు విస్తరించింది. దాదాపు కొత్తగా ప్రతిపాదించిన రీజినల్ రింగు రోడ్డు వరకు ఉన్న గ్రామాలు, మున్సిపాలిటీలను హెచ్‌ఎండీఏలోకి తీసుకువస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. కానీ, గడిచిన ఏడాదిన్నర కాలంలో ఏ ఒక్క ప్రాజెక్టును కూడా ఈ విభాగం చేపట్టింది లేదు. రేవంత్ రెడ్డి సీఎం పదవీ బాధ్యతలు స్వీకరించిన ఆరేడు నెలలు కొత్త ప్రాజెక్టులకు మాత్రం శంకుస్థాపన చేశారు గానీ, ఇప్పటివరకు ఆ ప్రాజెక్టులలో తట్టెడు మట్టిని తీసింది లేదు. దీంతో ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిన హెచ్‌ఎండీఏలో అభివృద్ధి పనులు లేకుండా పోయాయి. పాత ప్రాజెక్టులకు పూతలు వేసినట్లుగా, మరమ్మతులు, నిర్వహణలకు మాత్రమే కోట్ల రూపాయలను వెచ్చిస్తుందే తప్పా... కొత్తగా, నగరాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను పట్టాలెక్కించడంలో వెనుకబడిపోతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నది.

### పెట్టుబడులకు అభివృద్ధే కీలకం

విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు గత పదేండ్లలో బీఆర్‌ఎస్ వినూత్న రీతిలో ప్రణాళికలను అమలు చేసింది. పెరుగుతున్న పరిధికి అనుగుణంగా అంతర్జాతీయ స్థాయి పట్టణాభివృద్ధిని వ్యూహాత్మకంగా చేపట్టింది. ఈ క్రమంలో సుందరీకరణ, లింకు రోడ్ల నిర్మాణం, అంతర్జాతీయ స్థాయిలో పార్కులు, అర్బన్ ఫారెస్ట్రీ, భవన నిర్మాణ అనుమతులతో సంస్కరణలను అభివృద్ధిలో నగరాన్ని పరుగులు పెట్టించింది. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రావడం వల్ల ఏడాదిన్నర కాలంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారి, ప్రతిపాదన దశలో ఉన్న ఎన్నో ప్రాజెక్టులకు మార్పులు, చేర్పులతో సర్దుబాటు చేస్తున్నది. ప్రాజెక్టులు ఏవైనా ప్రతిపాదనలకే పరిమితం అవుతున్నాయే తప్పా.. ఇప్పటికీ ఇంచు పురోగతి లేకుండా పోయింది. ఇలా మహానగరంలో అభివృద్ధి కుంటుపడుతున్నది. ఇతర మెట్రో నగరాలకు గట్టి పోటీనిచ్చే హైదరాబాద్ నగరంలో గడిచిన ఏడాదిన్నర కాలంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం లేక వెలవెలబోతున్నది.

### అటకెక్కిన ప్రతిపాదనలు

హెచ్‌ఎండీఏ పరిధిలో దాదాపు రూ. 5వేల కోట్లతో అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు ఉన్నాయి. ఎన్నికల కారణంగా పక్కన పెట్టారు. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రణాళికలను పక్కన పెట్టి... కొత్త ప్రాజెక్టుల పేరిట హడావుడి చేస్తుందే తప్పా పనులు చేపట్టడం లేదు. అలా హెచ్‌ఎండీఏ పరిధిలో చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారితే... రోడ్డుకు అడ్డుగా ఉందని నేలకూల్చిన సైకిల్ ట్రాక్ పునర్ నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఇక కొత్వాల్‌గూడ్‌లో చేపట్టిన ఏకోపార్క్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది. ఇలా వరల్డ్ క్లాస్ మౌలిక వసతుల నిర్మాణంలో తలమునకలయ్యే హెచ్‌ఎండీఏ ఉత్సాహం నీరుగారిపోతూనే ఉన్నది.



## శంకరపల్లిలో హర్ష టొయోటా ఫెస్టివల్ కౌంటర్

సిటీబ్యూరో, మే 30(నమస్తే తెలంగాణ): శంకరపల్లిలో హర్ష టొయోటా ఫెస్టివల్ కౌంటర్‌ను స్థానిక మున్సిపల్ కమిషనర్ యోగేశ్, ఎంపీడీవో వెంకయ్య చేతుల మీదుగా శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీపీ సేల్స్, మార్కెటింగ్ అధికారి ప్రశాంత్ పాములపర్తి, సేల్స్ జీఎం జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆలిండియా ఆర్ట్ కాంపిటీషన్ అండ్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రదర్శనలోని చిత్రాలను తిలకిస్తున్న ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి

కొండాపూర్, మే 30: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శుక్రవారం ఆల్ ఇండియా ఆర్ట్ కాంపిటీషన్ అండ్ ఎగ్జిబిషన్ 2025-26 ఎడిషన్ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం పలువురు కళాకారులతో కలిసి ఆర్ట్ ఎగ్జిబిషన్‌లోని చిత్రాలను తిలకించారు. జూన్ 9వ తేదీ వరకు కొనసాగే ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో 144 ఆర్ట్ వర్క్స్ ప్రదర్శనలో ఉంచారు. ఆర్ట్ కాంపిటీషన్‌కు 646 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో నుంచి 155 ఆర్ట్ వర్క్స్‌లను జూరీ కమిటీ ఎంపిక చేసింది. ఫైనల్‌గా 45 మంది చిత్రకారులు అవార్డులకు ఎంపికయ్యారు. విజేతలలో మొదటి విజేతకు రూ.లక్ష, రెండో విజేత(ముగ్గురు) రూ.50వేలు, మూడో విజేత(20 మంది) రూ. 20వేలు అందించనుండగా, మిగతా వారికి ప్రోత్సాహక బహుమతులను జూన్ 9వ తేదీన నిర్వహించనున్న ముగింపు వేడుకల్లో అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



## టీజేఎఫ్ రజతోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

### పరిశీలించిన మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

ఖైరతాబాద్, మే 30: నెక్లెస్ రోడ్‌లోని జలవిహార్ వేదికగా శనివారం జరగనున్న తెలంగాణ జర్నలిస్టు ఫోరం రజతోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం టీజేఎఫ్ వ్యవస్థాపకులు, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతీ సాగర్, టీజేఎఫ్ వ్యవస్థాపక సభ్యులు ఎ.రమణకుమార్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కోశాధికారి యోగానంద్, సహాయ కార్యదర్శి యార నవీన్‌కుమార్, ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. సభా నిర్వహణ ప్రధాన ప్రాంగణం, వేదిక, భోజన ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివస్తున్న జర్నలిస్టులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అల్లం నారాయణ సూచించారు.

# 14న జాతీయ లోక్ అదాలత్

- మరోసారి హైదరాబాద్‌ను తొలిస్థానంలో నిలబెట్టాలి
- సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా




'నమస్తే తెలంగాణ' ముఖాముఖీలో మాట్లాడుతున్న కార్యదర్శి అబ్దుల్ జావేద్ పాషా

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, మే 30(నమస్తే తెలంగాణ): ప్రతీ మూడు నెలలకోసారి ఏర్పాటు చేస్తున్న జాతీయ లోక్‌అదాలత్ వచ్చేనెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా శుక్రవారం స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'నమస్తే తెలంగాణ'తో ముఖాముఖీలో ముచ్చటించారు. గతంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో దేశంలోనే హైదరాబాద్ జిల్లా మొదటిస్థానంలో నిలిచిందని, రాబోవు జాతీయ లోక్ అదాలత్‌ను సైతం తొలి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు. సెప్టెంబర్ నెలలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 1,57,370 కేసులను పరిష్కరించిందని, డిసెంబర్‌లో 1,71,169 కేసులను,మార్చిలో 2,29,189 కేసులను తొలగించి హైదరాబాద్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. సికింద్రాబాద్, నాంపల్లి, మనోరంజన్ ప్రాంగణంలోని కోర్టులకు చెందిన కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. వచ్చే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రథమ స్థానంలో నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

**పోలీసు అధికారులతో సమావేశం**

హైదరాబాద్ జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లకు చెందిన పోలీసు అధికారులతో జాతీయ లోక్ అదాలత్‌పై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కక్షిదారులను ప్రోత్సహించేందుకు పోలీసులు సహకరించాలని, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృధా చేసుకోకుండా తెలియజేయడం ద్వారా మరోసారి హైదరాబాద్ జిల్లా ప్రథమస్థానం సాధించే అవకాశం ఉంటుందన్నారు.

**బ్యాంకులతో చర్చలు**

రుణాలు పొందిన ఖాతాదారులు తిరిగి డబ్బులు చెల్లించకపోవడంతో వారిపై నమోదైన కేసులను పరిష్కరించే దిశగా బ్యాంక్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించినట్లు తెలిపారు.హైదరాబాద్ జిల్లాలో మేనేజర్లతోపాటు ఉద్యోగులకు పలు సూచనలు ఇచ్చామన్నారు. చెక్కుబౌన్స్, రోడ్డు ప్రమాదాలు, వివాహ సంబంధ కేసులు, ఎక్సైజ్, బీఎన్‌ఎస్ కింద నమోదైన రాజీకి వీలున్న కేసుల పరిష్కారానికి మంచి వేదికన్నారు. కేసుల పరిష్కారానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు విశేషంగా చర్యలు తీసుకోవాలన్నారు. రాజీకి వీలుండే కేసులను గుర్తించి ఇరు వర్గాలకు చెందిన కక్షిదారులను రాజీ చేసుకునేందుకు సహకరించి అధిక కేసుల పరిష్కారానికి జడ్జిలు సహకరించాలని కోరినట్టు తెలిపారు.

**బార్ అసోసియేషన్ సహకారం**

నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవికిశోర్‌తోపాటు ప్రధాన కార్యదర్శి ఎన్వీ.రమణగౌడ్ నేతృత్వంలో విజయవంతంగా మరోసారి హైదరాబాద్ జిల్లాను తొలి స్థానంలో నిలిచేందుకు సహకరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

## ఎయిర్‌పోర్టులో గంజాయి పట్టివేత

శంషాబాద్ రూరల్, మే 30 : బ్యాంకాక్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్యాంకాక్ నుంచి తాయి ఎయిర్‌లైన్స్ 329 విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ఓ ప్రయాణికుడిపై అనుమానం వచ్చిన అధికారులు తనిఖీలు చేయగా అతడి వద్ద 10 కిలోల గంజాయి లభించినట్లు తెలిపారు. దీంతో నిందితుడిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు వివరించారు.

## డ్రగ్స్ విక్రేతల అరెస్ట్

సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ విక్రయిస్తున్న ముగ్గురిని ఆబ్కారీ ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 10 ఎల్‌ఎస్‌డీ బ్లాస్టల డ్రగ్స్‌తో పాటు ద్విచక్రవాహనం, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్టీఎఫ్ ఈఎస్ అంజిరెడ్డి కథనం ప్రకారం.. నగరానికి చెందిన దీపక్, కెవిన్, మహ్మద్ సాజిద్ రామంతాపూర్, మాధురి రెస్టారెంట్ సమీపంలో డ్రగ్స్ విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న ఎస్టీఎఫ్ బృందం నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. కేసును ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

సరూర్‌నగర్‌లో గంజాయి విక్రయిస్తున్న ప్రజ్వల్, పవన్, ప్రసన్నకుమార్, శ్రీకర్‌లను ఎస్టీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 1.1కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా స్వప్నిక్ అనే మరో నిందితుడు పరార్‌లో ఉన్నట్లు ఆబ్కారీ అధికారులు తెలిపారు.

# కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయాలి

### బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



నిరుద్యోగులతో కలిసి ధర్నాలో నినదిస్తున్న ఆర్.కృష్ణయ్య

కవాడిగూడ, మే 30: కొత్తగా ఏర్పడిన జిల్లాలు, మండల కార్యాలయాలకు అనుగుణంగా అదనపు పోస్టులు సృష్టించి తక్షణమే వాటిని భర్తీ చేసేందుకు కొత్త నోటిఫికేషన్లు విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించి ప్రభుత్వ విభాగాల్లోని అన్ని పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్ నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఆరేళ్ల కిందట ఏర్పాటైన 23 జిల్లాల్లోని అన్ని విభాగాల్లో ఇన్‌చార్జిలతో ప్రభుత్వ పాలన ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. పాతపోస్టులు, అదనపు బాధ్యతలతో ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహించడం సరికాదన్నారు. దీంతో ఉద్యోగులపై పనిభారం పడటం తప్పితే రాష్ట్రానికి, ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని చెప్పారు. జిల్లా స్థాయిలో ఒక్కో అధికారిని మూడు నాలుగు విభాగాలకు ఇన్‌చార్జిలుగా నియమిస్తే సజావుగా పనులు సాగవన్నారు. 23 జిల్లాల్లోని 40 శాఖలు, 131 మండలాలు, 30 రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, 76 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లు, 4,383 గ్రామ పంచాయతీలతోపాటు అనేక పోలీస్‌స్టేషన్లు ఏర్పడ్డాయని చెప్పారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-4లతో పాటు అన్ని సర్వీస్ పోస్టులను భర్తీ చేయడానికి తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మెరిట్ అభ్యర్థులు అన్ని పోస్టులకు ఎంపికయ్యే అవకాశం ఉన్నందున ప్రస్తుత పద్ధతి ప్రకారం.. వెయిటింగ్ లిస్ట్, ఆప్షన్ విధానంతో కాలపరిమితితో పోస్టుల భర్తీ చేయాలన్నారు. అన్ని రకాల టీచర్ పోస్టులను సైతం ఆప్షన్ విధానంలోనే భర్తీ చేయాలని కృష్ణయ్య ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో విఠల్, హరికృష్ణ, పృధ్వీ, వేముల రామకృష్ణ, అనంతయ్య, రాజేందర్, సతీశ్, మోదీరాందేవ్, జనార్దన్, బాలయ్య, వీరన్న, నందగోపాల్, తదితర నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నా కుమార్తెకు రక్షణ కల్పించండి

### వేడుకుంటున్న బాధితుడు గులాం అఫ్జల్




వివరాలు వెల్లడిస్తున్న న్యాయవాది విజయ్ కుమార్, గులాం అఫ్జల్

ఖైరతాబాద్, మే 30 : పెండ్లి చేసుకొని అమెరికా వెళ్లి భర్త చేతిలో మోసపోయిన తన కుమార్తెకు రక్షణ కల్పించాలని ఎస్‌ఆర్‌నగర్‌కు చెందిన 84 ఏండ్ల విశ్రాంత తహసీల్దార్ గులాం అఫ్జల్ భారత ప్రభుత్వాన్ని వేడుకున్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హైకోర్టు న్యాయవాది గుట్టపాలెం విజయ్‌కుమార్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. తన ఒక్కగానొక్క కుమార్తెను 2007లో గుల్బరాకు చెందిన ఓ వైద్యుడికి ఇచ్చి వివాహం జరిపించాను, ఇద్దరు అమెరికాలో స్థిరపడ్డారని..నెల రోజులు కాపురం చేసిన తర్వాత వేధింపులకు పాల్పడి ఆమెను వదిలేశాడన్నారు. ఆ వివాదం ముదిరి 2011లో విడాకులు తీసుకున్నారన్నారు. ఆమె భర్త అక్కడి కోర్టులో తప్పుడు కేసులు పెట్టడంతో ఆమెపై జరిమానా విధించారని, దీంతో కోటి రూపాయల వరకు భరణం కట్టాల్సి వచ్చిందన్నారు. నా కూతురు వారిపై న్యాయపోరాటం చేస్తుందని భావించి కొంత కాలంగా అమెరికాలో దాడులు చేయించాడన్నారు. ప్రస్తుతం ఆమెపై కేసులు ఉండటం వల్ల భారత్‌కు తిరిగి రాలేకపోతుందన్నారు. ఉన్న ఉద్యోగం పోయి ఒంటరిగా ఉంటున్నదని, తాను తన భార్యకు వచ్చే పెన్షన్ డబ్బులను ఆమెకు పంపిస్తున్నామని వాపోయారు. తన అల్లుడిపై ఇక్కడ కేసులు పెట్టగా, విచారణకు హాజరుకాకపోగా బయట నుంచే ఆమెను మరింత వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. ప్రభుత్వం స్పందించి తమ కుమార్తెకు రక్షణ కల్పించి తగిన న్యాయం చేయాలని కోరారు.

## అధికారుల నిర్లక్ష్యం.. సిద్ధంకాని వన మహోత్సవ ప్రణాళిక

### మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొక్కలు నాటే లక్ష్యం 70 లక్షలు

మేడ్చల్, మే 30 (నమస్తే తెలంగాణ): వన మహోత్సవానికి ప్రణాళిక సిద్ధం చేయడంలో అధికారుల నిర్లక్ష్యం కనపడుతున్నది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో వన మహోత్సవంలో భాగంగా అధికారులు 70 లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఇప్పటికే వానలు పడుతున్న నేపథ్యంలో మొక్కలు నాటే ప్రణాళిక ఎప్పుడు సిద్ధం చేస్తారు.. మొక్కలు నాటే కార్యక్రమం ఎప్పుడు చేపడుతారన్న సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. వన మహోత్సవానికి ప్రణాళికను త్వరగా సిద్ధం చేసి మొక్కలు నాటేలా చూడాలని కోరుతున్నారు. మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తించి ప్రణాళికను సిద్ధం చేయాల్సి ఉంటుంది.

### బీఆర్‌ఎస్ హయాంలో 3 నెలల ముందే ప్రణాళిక..

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మూడు నెలల ముందు నుంచే ప్రణాళికను సిద్ధం చేసే వారని ప్రకృతి ప్రేమికులు గుర్తు చేసుకుంటున్నారు. మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తించడమే కాకుండా ఎండిపోయిన మొక్కల స్థానాల్లో నూతన మొక్కలు నాటేందుకు సిద్ధం చేసేవారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఉద్యమంలా నిర్వహించడమే కాకుండా విద్యార్థులు, కాలనీ సంక్షేమ సంఘాలు, మహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేసి హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడమే కాకుండా నాటిన మొక్కలను సంరక్షించేలా బాధ్యతలు అప్పగించేవారు.

## తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్మన్‌గా ప్రతాపరెడ్డి




సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గ్రామీణ బ్యాంకు నూతన చైర్మన్‌గా ఎస్‌బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్న కె.ప్రతాపరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈయన గత రెండు దశాబ్దాలుగా ఎస్‌బీఐలో సేవలందిస్తున్నారు. ప్రతాపరెడ్డి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు చైర్మన్‌గా కూడా రెండేండ్లపాటు పనిచేశారు. అది ప్రస్తుతం తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారడంతో చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఎస్‌బీఐలో డొమెస్టిక్, ఫారెన్ అసైన్‌మెంట్స్, కమర్షియల్ క్రెడిట్ అసైన్‌మెంట్ల నిర్వహణలో ప్రతాపరెడ్డికి అపార అనుభవం ఉన్నది.

## ఏపీ సచివాలయ ఉద్యోగుల కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా రాజేశ్

### అభినందించిన తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం

సిటీబ్యూరో, మే 30 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ స్టాఫ్ కోఆపరేటివ్ సొసైటీ నూతన అధ్యక్షుడిగా రేండ్ల రాజేశ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తెలంగాణ సచివాలయ సంఘం అధ్యక్షుడు గిరి శ్రీనివాస రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎం.నవీన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌దేవేందర్ తదితరులు ఏపీ సచివాలయ ఉద్యోగుల సొసైటీ నూతన అధ్యక్షుడు రేండ్ల రాజేశ్, ఇతర కార్యవర్గ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు టి.జయహరి, కార్యదర్శి టి.స్వరణ్‌రాజ్, కోశాధికారి జి.ప్రశాంత్‌కుమార్, డైరెక్టర్లు కె.స్వామి, ఆర్ శ్రీలక్ష్మి, జి.అనురాధ, ఎం.రవీంద్రకుమార్, ఎం.అరవింద్‌గౌడ్, టి.రాజీవ్‌చంద్, ఎ.దుర్గేందర్ పాల్గొన్నారు.



## ఎన్‌జీఆర్‌ఐ శాస్త్రవేత్త రామ్మోహన్‌కు నేషనల్ జియో సైన్స్ అవార్డు



డాక్టర్ రామ్మోహన్

ఉప్పల్, మే 30: హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్- జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థలో పనిచేస్తున్న చీఫ్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.రామ్మోహన్ ప్రతిష్టాత్మకమైన నేషనల్ జియోసైన్స్ అవార్డు- 2024కు ఎంపికయ్యారు. ఈ మేరకు ఎన్‌జీఆర్ఐ ఒక ప్రకటన విడుదల చేసింది. భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వశాఖ అందించే ఈ అవార్డు, భూరసాయనశాస్త్ర రంగానికి ఆయన చేసిన అసాధారణ కృషిని గుర్తిస్తూ ప్రదానం చేస్తారని తెలిపారు. డాక్టర్ రామ్మోహన్ ముఖ్యంగా ఆర్కియన్ క్రస్టల్ పెరుగుదల ప్రక్రియలు, బంగారు లోహశాస్త్రం, ఇండియన్ షీల్డ్ యొక్క పరిణామక్రమాన్ని అర్థం చేసుకోవడంలో పరిశోధన చేశారు. భూరసాయన శాస్త్రం, భూకాలానుక్రమ శాస్త్రం, ఐసోటోప్ భూరసాయన శాస్త్రంలో ప్రత్యేకత కలిగిన ఆయన విస్తృత పరిశోధన ఆర్కియన్ ధార్వార్, బస్తర్, సింగ్భూమ్, బుందేల్ఖండ్ క్రేటాన్లు, దక్షిణ గ్రాన్యులైట్ ప్రాంతాల వరకు విస్తరించింది. ఆయన నేషనల్ జియోసైన్స్ అవార్డు-2024కి ఎంపిక కావడంతో దేశంలో భూవిజ్ఞాన పరిశోధనలను ముందుకు తీసుకెళ్లడంలో కీలకపాత్ర ఉంటుందని తెలిపారు.